క్లుప్తంగా

నో బ్యాగ్ డే



కాకర సాగును విద్యార్థులకు వివరిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

మంచాల: జాపాల ప్రాథమిక పాఠశాల విద్యార్థుల నో బ్యాగ్ డే విజయవంతంగా ముగిసింది. నో బ్యాగ్ డే కార్యక్రమంలో భాగంగా శనివారం జాపాల గ్రామంలోని శ్రీనివాస్‌రెడ్డి వ్యవసాయ పొలంలో కాకర, వంగ పంటలను విద్యార్థులు పరిశీలించారు. అదే విధంగా కుండల తయారీ విధానాన్ని గమనించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జహీర్ మాట్లాడుతూ విద్యార్థులు క్షేత్ర స్థాయిలో పంటల సాగును పరిశీలించి సాగు పద్ధతులను తెలుసుకున్నారని తెలిపారు. విద్యార్థుల్లో నైపుణ్యం పెరగాలంటే తరగతి గదుల్లో ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలతో పాటు పరిశీలన కూడా ముఖ్యమని చెప్పారు. దీంతో విద్యార్థుల్లో విజ్ఞానం పెరుగుతుందని పేర్కొన్నారు. డ్రిప్ సిస్టం, మల్చింగ్ కవర్, పందిరి కూరగాయాల సాగుతో పాటు పలు అంశాలను శ్రీనివాస్‌రెడ్డి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ సమావేశానికి మైనార్టీ నాయకులు



తెలంగాణ భవన్‌లో ఆమనగల్లు బీఆర్‌ఎస్ నాయకులు

ఆమనగల్లు: తెలంగాణ భవన్‌లో శనివారం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర బీఆర్‌ఎస్ మైనార్టీ విభాగం సమావేశానికి ఆమనగల్లు పట్టణానికి చెందిన పలువురు ఆ పార్టీ మైనార్టీ నాయకులు హాజరయ్యారు. సమావేశానికి ఆమనగల్లుకు చెందిన సయ్యద్ ఖలీల్, అక్బర్, అనిఫ్ హాజరయ్యారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మైనార్టీ విభాగం పటిష్టతపై కేటీఆర్ చర్చించినట్లు సయ్యద్ ఖలీల్ తెలిపా00000రు.

పాఠశాలకు బోర్డు ఏర్పాటు



ముర్తుజపల్లి ప్రభుత్వ పాఠశాలకు ఏర్పాటు చేసిన బోర్డు

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని ముర్తుజపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు బోర్డు ఏర్పాటు చేశారు. ముర్తుజపల్లి గ్రామానికి చెందిన చంద్రశేఖర్, బోదాసు చంద్రశేఖర్ పాఠశాల గేటుపై బోర్డు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మణిపాల్‌రెడ్డి, ఉపాధ్యాయుడు ఆంజనేయులు పాల్గొన్నారు.

ఘనంగా పాలకవర్గ వార్షికోత్సవం



వేడుకల్లో పాల్గొన్న పెద్దఅంబర్‌పేట పాలకవర్గం

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘ కార్యవర్గం నాలుగేళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా శనివారం మున్సిపల్ కార్యాలయంలో పాలకవర్గసభ్యులు వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. చైర్‌పర్సన్ స్వప్న, వైస్ చైర్‌పర్సన్ సంపూర్ణ, కౌన్సిలర్లతో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం పాలకవర్గ సభ్యులను ఘనంగా సత్కరించారు.

నేడు మండల పర్యటనకు ఎమ్మెల్యే

యాచారం: ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆదివారం యాచారం మండల పర్యటనకు వస్తున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని గడ్డమల్లయ్యగూడ, మల్కీజ్‌గూడ, తమ్మలోనిగూడ, మాల్ గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొంటారని తెలిపారు.

రోడ్లన్నీ గుంతలమయం!

- అధ్వానంగా గ్రామీణ రహదారులు
- నిధులు మంజూరైనా మొదలు కాని పనులు
- ఎన్నికల ముందు హడావుడిగా శంకుస్థాపనలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు
- ఇబ్బందుల్లో వాహనదారులు, ప్రజలు



గుంతలమయంగా వెంకటాపూర్-కనకమామిడి రోడ్డు

మొయినాబాద్: రోజురోజుకు గ్రామాల రోడ్లు అధ్వానంగా మారుతున్నాయి. కంకర తేలుతూ గుంతలమయంగా తయారవుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. పదేళ్లుగా రోడ్లకు మరమ్మతులు చేపట్టలేదు. రోడ్డు పనుల కోసం అభివృద్ధి నిధులు మంజూరైనా ఎన్నికల ముందు హడావుడిగా శంకుస్థాపనలు చేశారు. దీంతో నేటికీ పనులు మొదలు పెట్టలేదు. మొయినాబాద్ మండలంలోని పది గ్రామాల రోడ్లకు గత ప్రభుత్వం 2023, ఆగస్టులో సుమారు రూ.24 కోట్లు మంజూరు చేసింది. దీంతో అప్పటి మంత్రి సబితాఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి సెప్టెంబర్‌లో శంకుస్థాపనలు సైతం చేశారు. ఆ తరువాత ఎన్నికల కోడ్ రావడంతో పనులు చేపట్టలేదు. ప్రస్తుతం ఎన్నికలు ముగిసి రెండు నెలలు కావస్తున్నా ఇంత వరకు పనులు జరగడం లేదు.

ఇబ్బందుల్లో వాహనదారులు..

మొయినాబాద్ మండలంలోని పెద్దమంగళారం-చందానగర్, ఎన్కేపల్లి-బాకారం, నక్కలపల్లి-వెంకటాపూర్, సురంగల్-వెంకటాపూర్, మొయినాబాద్-ముర్తూజగూడ, కనకమామిడి-వెంకటాపూర్, తోలుకట్ట-ఎత్‌బార్‌పల్లి-నక్కలపల్లి, నాగిరెడ్డిగూడ-బాకారం గ్రామాల రోడ్లు పూర్తిగా అధ్వానంగా తయారయ్యాయి. ఆయా గ్రామాల రోడ్లను పదేళ్లుగా పట్టించుకోలేదు. 2014లో కొన్ని రోడ్లకు రీ బీటీ వేశారు. ఆ తరువాత ఇంత వరకు మరమ్మతులు చేపట్టలేదు. మూడేళ్లుగా వర్షాలకు రోడ్లన్నీ దెబ్బతిన్నాయి. గుంతల మయంగా మారాయి. దీంతో వాహనదారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయాల్లో వాహనదారులు, స్థానిక ప్రజలు ఆ రోడ్లపై ప్రయాణం చేయాలంటేనే జంకుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని వారు ఆందోళన చెందుతున్నారు. ఐదు నిమిషాల్లో పూర్తి చేయాల్సిన దూరాన్ని గుంతల కారణంగా అరగంటకు పైగా సమయం పడుతుంది.

నిధులు మంజూరైనా మొదలు కాని పనులు...

- కనకమామిడి-వెంకటాపూర్ రోడ్డు అభివృద్ధికి రూ.6.5 కోట్లు మంజూరయ్యాయి. టెండర్ పూర్తయి కాంట్రాక్టర్‌కు అగ్రిమెంట్ కూడా అయ్యింది. కానీ ఇంత వరకు పనులు మొదలు పెట్టడంలేదు.
- పెద్దమంగళారం-చందానగర్ రోడ్డు అభివృద్ధికి రూ.2.80 కోట్లతో అధికారులు టెండర్ పిలిచారు. దీంతో ఈ ప్రక్రియ ఇంకా కొనసాగుతుంది.
- శ్రీరాంనగర్-అమ్డాపూర్ రోడ్డు అభివృద్ధికి రూ.3.50 కోట్లు మంజూరు కావడంతో పనులు జరుగుతున్నాయి.
- తోలుకట్ట-నక్కలపల్లి రోడ్డుకు ప్యాచ్ వర్క్ కోసం రూ.1.20 కోట్లు మంజూరైనా టెండర్ దశలోనే ఉంది.
- నక్కలపల్లి-వెంకటాపూర్ రోడ్డులో కల్వర్టు నిర్మాణం, ప్యాచ్ వర్క్ కోసం రూ.38.50లక్షలు మంజూరైనా ఇప్పటి వరకు పనులు మొదలు కాలేదు.
- సురంగల్-వెంకటాపూర్ రోడ్డు అభివృద్ధికి రూ.1.20 కోట్లు నిధులు మంజూరైనా టెండర్ దశలోనే ఉంది.

రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం



రోడ్డు పనుల నిమిత్తం ఎన్నికల ముందు నిధులు మంజూరు చేసి ఉరుకులు, పరుగులతో శంకుస్థాపనలు చేశారు. కానీ ఇప్పటి వరకు పనులను చేపట్టలేదు. రోడ్లన్నీ గుంతల మయంగా మారడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ విషయాన్ని పట్టించుకొని త్వరగా రోడ్డు పనులు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలి.

గణేశ్, చందానగర్, మొయినాబాద్ మండలం

టెండర్లు కొనసాగుతున్నాయి



మండలంలోని కొన్ని గ్రామాల రోడ్లకు ప్రభుత్వం ఆరు నెలల క్రితం నిధులు మంజూరు చేసింది. కొన్ని రోడ్లకు టెండర్లు పూర్తయ్యాయి. మరికొన్ని రోడ్డు పనులకు టెండర్లు కొనసాగుతున్నాయి. శ్రీరాంనగర్-అమ్డాపూర్ రోడ్డు పనులు మాత్రం జరుగుతున్నాయి. త్వరలో మిగితా రోడ్డు పనులను చేపడుతాం.

విజయ్‌కుమార్, పంచాయతీరాజ్ డీఈ, మొయినాబాద్

- ఎన్కేపల్లి-బాకారం రోడ్డు అభివృద్ధికి రూ.2.50 కోట్లు మంజూరయ్యాయి. టెండర్లు మాత్రం పిలిచారు.
- నాగిరెడ్డిగూడ-బాకారం రోడ్డు అభివృద్ధికి రూ.3 కోట్లు నిధులు మంజూరయ్యాయి. దీంతో టెండర్ ప్రక్రియ జరుగుతుంది.
- మొయినాబాద్-ముర్తూజగూడ-అమ్డాపూర్ రోడ్డు వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.2.30 కోట్లు మంజూరు చేశారు.

'లయన్స్' సేవలను విస్తృతం చేస్తాం



అన్నదానం చేస్తున్న గోవర్ధన్‌రెడ్డి తదితరులు

కడ్తాల్: లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ద్వారా ప్రస్తుతం అందిస్తున్న సేవలను మరింత విస్తృత పరుస్తామని, సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి కోరారు. శనివారం మండల కేంద్రంలో దివంగత గంగాపురం సుశీలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె కుమారుడు లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి సహకారంతో లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో వైద్య, రక్తదాన, నేత్ర పరీక్ష శిబిరాలతో పాటు పేద విద్యార్థుల ఉన్నత చదువులకు తోడ్పాటునందిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమం ద్వారా అన్నదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు శ్రీనివాస్, రాజేందర్‌యాదవ్, బీచ్యానాయక్, లక్ష్మయ్య, రాజు పాల్గొన్నారు.

కేవైసీ గడువు పెంచాలి

తలకొండపల్లి: రేషన్ కార్డుల కేవైసీ గడువు పెంచాలని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు తిరుపతి శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. బోగస్ రేషన్ కార్డుల ఏరివేతలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేవైసీ గడువు ఈ నెలాఖరుతో ముగిస్తుందన్నారు. ఈ ప్రక్రియ జిల్లావ్యాప్తంగా మందకొడిగా సాగుతోందన్నారు.

అన్ని తండాలకు బీటీ రోడ్లు



ఎమ్మెల్యే నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

- సీఎంను కలిసి ప్రత్యేక నిధులు తెస్తా
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలోని అన్ని గిరిజన తండాలకు బీటీరోడ్లు నిర్మించేందుకు కృషి చేస్తానని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హామీ ఇచ్చారు. గతంలో ఎమ్మెల్సీగా నియోజకవర్గంలో అనేక గ్రామాలు, తండాలకు బీటీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించినట్లు గుర్తుచేశారు. శనివారం హైదరాబాద్‌లో నారాయణరెడ్డిని ఆమనగల్లు మండలం శంకరకొండతండా గ్రామ పంచాయితీ పరిధిలోని దయ్యాలబోడుతండాకు చెందిన వార్డు సభ్యులు రాజునాయక్, తండా యువకులు రాజేశ్, జైపాల్, వినోద్, రాజు, కేఎస్‌ఆర్ యువసేన జిల్లా నాయకుడు విజయ్‌రాథోడ్ మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. అనంతరం దయ్యాలబోడుతండాకు బీటీ రోడ్డు నిర్మించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి కల్వకుర్తి అభివృద్ధికి ప్రత్యేక నిధులు తీసుకువస్తానని చెప్పారు. మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. అనంతరం తోటపల్లి గ్రామ పంచాయితీలో జరిగిన వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో కసిరెడ్డి పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోండి

తహసీల్దార్‌కు వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న యాదయ్య తదితరులు

తలకొండపల్లి: చెరువు శిఖం భూమిని కబ్జా చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు యాదయ్య డిమాండ్ చేశారు. గ్రామాల్లో ఉన్న చెరువులపై ముదిరాజ్‌లకే హక్కు ఉంటుందన్నారు. ఈ మేరకు ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ రంగారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ తలకొండపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో 153 సర్వే నంబర్‌లోని ఎర్రకుంట చెరువు శిఖం భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమించారని వారిపై చర్యలు తీసుకోవాలని మూడు నెలల క్రితం తహసీల్దార్ దృష్టికి తెచ్చామని, అప్పట్లో హద్దులు కూడా గుర్తించారని తెలిపారు. ఇటీవల కొందరు మళ్లీ ఆక్రమించుకొని సాగు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, అందువల్ల తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నర్సింహ, ఉప సర్పంచ్ అనిల్, యూత్ అధ్యక్షుడు నాగరాజు, శేఖర్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే అభివృద్ధి

సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్: గ్రామ పంచాయతీల అభివృద్ధి సమష్టి కృషితోనే సాధ్యమవుతుందని స్థానిక సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సాధారణ సమావేశంలో ఐదేళ్లుగా కడ్తాల్ గ్రామ పంచాయతీలో జరిగిన అభివృద్ధిని వివరించారు. ఆదాయ వ్యయాలను చదివి వినిపించారు. పారిశుద్ధ్య నిర్వాహణలో గ్రామ పంచాయతీ సిబ్బంది పనితీరును గుర్తుచేస్తూ అభినందించారు. పార్టీలకతీతంగా సహకరించిన పాలకవర్గ సభ్యులను, సిబ్బందిని, కార్యదర్శిని ఈ సందర్భంగా సన్మానించారు. ఈ నెల 30న ప్రత్యేక గ్రామసభ ఏర్పాటు చేస్తున్నామని, ప్రతి ఒక్కరూ హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రామకృష్ణ, వార్డు సభ్యులు నరేందర్‌రెడ్డి, మల్లయ్య, భిక్షపతి, మహేశ్, సువర్ణ, గణేశ్, దీపికారెడ్డి, ఎట్టమ్మ, బుజ్జమ్మ, కోఆప్షన్ సభ్యుడు వెంకటయ్యగౌడ్, లాయక్‌అలీ, రాఘవేందర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనర్సింహారెడ్డి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలోని పలు కాలనీలకు ఆదివారం విద్యుత్ సరాఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రావు తెలిపారు. విద్యుత్ తీగలపై పతంగులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నంలోని ఎంబీఆర్ నగర్, బృందావన్‌కాలనీ, వడ్డెర బస్తీ, భాగ్యనగర్, రాయపోల్ రోడ్డు, చిన్న చెరువు ప్రాంతంలో విద్యుత్ ఉండదని తెలిపారు.

మంగల్‌పల్లి, రాందాసుపల్లి సబ్‌స్టేషన్లలో..

మంగల్‌పల్లి, రాందాసుపల్లి సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని అదిభట్ల ఏఈ తెలిపారు. బొంగులూరు, ఎంపీ పటేల్‌గూడ, మంగళ్‌పల్లి, సాహెబ్‌గూడ, కొంగరకలాన్, రాందాసుపల్లి, చింతపల్లి గూడ, మల్‌శెట్టిగూడ శేరిగూడగృహ, ఉప్పరిగూడ, పోచారం పరిధిల్లోని పరిశ్రమలకు విద్యుత్ సరఫరాను ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

మాడ్గుల: మాడ్గుల మండలం కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌తో పాటు మండల పరిధిలోని అన్ని సబ్‌స్టేషన్‌లలో మరమ్మతుల కారణంగా ఆదివారం 4 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మాడ్గుల మండల విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. కొల్కులపల్లి, నాగిళ్ల, ఇర్విన్, ఆర్కపల్లి, మాడ్గుల సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

ఎంపీడీఓకు సన్మానం



ఎంపీడీఓ ఫారూక్‌హుస్సేన్‌ను సన్మానిస్తున్న పత్యానాయక్

ఆమనగల్లు: జిల్లాలో ఉత్తమ ఎంపీడీఓగా ఎంపికైన ఆమనగల్లు ఎంపీడీఓ ఫారూక్‌హుస్సేన్‌ను శనివారం పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు ఘనంగా సత్కరించారు. ఆమనగల్లు పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఫారూక్‌హుస్సేన్‌ను ఆమనగల్లు మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్, మండల రైతు సమన్వయ సమితీ కన్వీనర్ నారాయణ, మంగళపల్లి సర్పంచ్ తిప్పిరెడ్డి నర్సింహారెడ్డి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిరుపతయ్యగౌడ్, గణేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.ఇ00

నేడు మైసమ్మ బోనాలు

మహేశ్వరం: మామిడిపల్లిలోని ఈర్లగండి మైసమ్మ బోనాల ఉత్సవాలను నేడు (ఆదివారం) నిర్వహించనున్నామని కార్యనిర్వాహక సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ.. ప్రతి ఏడాది మాదిరిగానే ఈర్లగండి మైసమ్మ బోనాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. మూడు రోజుల ముందు నుంచే రంగులద్ది ఆలయాన్ని ముస్తాబు చేశామన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న గ్రామస్తులు

సమస్యలను పరిష్కరించాలి

జీఎంపీఎస్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కడ్తాల్: గొర్రెల, మేకల పెంపకం దారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం (జీఎంపీఎస్) మండల అధ్యక్షుడు క్యామ చంద్రశేఖర్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం మండల కేంద్రంలోని పాలశీతలీకరణ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జీఎంపీఎస్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి శ్రీశైలంయాదవ్, వివిధ గ్రామాల అధ్యక్షులు సత్తయ్య, వెంకటేశ్, మల్లయ్య, బీరప్ప, మల్లేశ్, కృష్ణయ్య, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

రామగిరిగుట్ట అభివృద్ధికి కృషి

మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న



సీసీ నిర్మాణ పనులను ప్రారంభించిన స్వప్న తదితరులు

హయత్‌నగర్: పసుమాములలోని రామగిరిగుట్ట అభివృద్ధికి కృషి చేస్తామని పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న తెలిపారు. గుట్టపైకి వెళ్లేందుకు సరైన మార్గం లేక భక్తులు అవస్థ పడుతున్నారు. దీంతో రూ.30 లక్షల వ్యయంతో రామగిరి గుట్ట పైకి సీసీ రోడ్డు పనులను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వప్న మాట్లాడుతూ రామగిరిగుట్ట జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మణెమ్మ, కో ఆప్షన్ సభ్యుడు శంకరయ్యగౌడ్, మాజీ సర్పంచ్ జైపాల్‌రెడ్డి, డీఈఈ అశోక్‌మార్, నాయకులు యాదయ్యగౌడ్, లింగంగౌడ్, బాల్‌రెడ్డి, రాజేశ్వర్‌గౌడ్, మల్లేశ్, రాజగౌడ్ పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం

రైతు సంఘం జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మధుసూదన్‌రెడ్డి తదితరులు

యాచారం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటం చేస్తామని రైతు సంఘం జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి ప్రకటించారు. ఫిబ్రవరి 16న ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గ్రామీణ బంద్ పిలుపు మేరకు యాచారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద శనివారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతు చట్టాలను తుంగలో తొక్కేందుకు కుట్రలు చేస్తోందని ఆరోపించారు. నల్లా చట్టాలతో బడా పారిశ్రామిక వేత్తలకు దేశాన్ని అమ్మే కుట్రలు చేస్తోందని దుయ్యబట్టారు. ఫిబ్రవరి 16న అన్ని గ్రామాల్లో సంపూర్ణ బంద్ పాటించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు అంజయ్య, బ్రహ్మయ్య, తావు నాయక్, చందునాయక్, బాషయ్య పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



యూటీఎఫ్ కార్యవర్గాన్ని సత్కరిస్తున్న నాయకులు

ఆమనగల్లు: ఆమనగల్లు మండల శాఖ యూటీఎఫ్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. శనివారం జరిగిన సమావేశంలో మండల అధ్యక్షుడిగా ఆంజనేయులు, ఉపాధ్యక్షులుగా పాండు, శ్వేత, ప్రధాన కార్యదర్శిగా శ్రీను, కోశాధికారిగా రాంచందర్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా దేవేందర్, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్‌గా వెంకటస్వామి, కార్యదర్శులుగా సుభాష్, లక్ష్మీనారాయణ, గన్య, రాంచందర్, కాంప్లెక్స్ కన్వీనర్‌లుగా రాంజీ, జైపాల్‌ను ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్షుడు ఆంజనేయులుతో పాటు కార్యవర్గాన్ని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు శ్రీధర్, సుదర్శన్‌రెడ్డి, రామలక్ష్మయ్య, సుదర్శన్, మహేశ్, రామస్వామి, పాండు పాల్గొన్నారు.

నాలుగేళ్లలో రూ.200 కోట్లతో అభివృద్ధి

బడంగ్‌పేట్: బడంగ్‌పేట కార్పొరేషన్‌లో పాలకవర్గం ఏర్పడి నేటితో నాలుగు సంవత్సరాలు పూర్తి యింది. ఈ సందర్భంగా శనివారం నూతన మున్సిపల్ కార్పొరేషన్ భవనంలో పాలకవర్గం, అధికారులు కలిసి కేక్‌కట్ చేసుకుని సంబరాలు చేసుకున్నారు. మేయర్ పారిజాత మాట్లాడుతూ.. నాలుగు సంవత్సరాల్లో రూ. 2 వందల కోట్ల అభివృద్ధి జరిగిందన్నారు. ఈ ఏడాదిలో 32 డివిజన్లను కలిపి మరింత అభివృద్ధి చేస్తామని, సమస్యలు లేని డివిజన్‌గా అన్ని డివిజన్లను తీర్చిదిద్దుతామన్నారు. సహకారం అందిస్తున్న సహ కార్పొరేటర్లకు, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ సుమన్‌రావు, కార్పొరేటర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.